ప్రజాశక్తి

శనివారం 25 ఫిబ్రవరి 2023

5

పార్వతీపురం మన్యం



రికార్డు అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయనగరం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎంఎల్ఎస్‌సి విభాగంలో (ఎంఎల్ఎస్‌సి)లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, చైర్మన్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, విజయనగరం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 18 నుండి 42 ఏళ్ల వయస్సు కలిగిన, దష్టిలోపం గల మహిళా అభ్యర్థులు ఫిబ్రవరి 28 సాయంత్రం 5గంటలలోపు ధరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

కార్పొరేట్లకు రాయితీలు, సామాన్యులపై భారాలా?

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రధాని నరేంద్రమోడీ కార్పొరేట్లకు పన్ను రాయితీలు కల్పించి, సామాన్యులపై భారాలు మోపారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం ఆందోళనలు జరిగాయి. ఇందులో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసననుద్దేశించి సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రధాని మోడీ విధానాల వల్ల సామాన్యులపై పన్నుల భారం పెరిగి బతకడానికి నానా అవస్థలు పడుతున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగాల్లేక ఆర్థికంగా ఎన్నో అవస్థలుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో అంబానీ, ఆదానీలు లక్షల కోట్లకు పడగలెత్తగా సామాన్యులు మాత్రం నిరుద్యోగం, ఆకలి చావులతో కొట్టుమిట్టాడుతున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు 8 శాతం పన్ను రాయితీ కల్పించిన బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలపై రూ.3.50లక్షల కోట్ల భారాన్ని మోపిందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. గ్యాస్ సబ్సిడీ కోత విధించారని, దీనివల్ల సామాన్యుల జీవనంపై ఎంతో ప్రభావం పడుతుందని అన్నారు. గతేడాది ఉపాధి హామీ పథకానికి రూ.90 వేల కోట్లు కేటాయించిగా, ఈ ఏడాది రూ.60వేల కోట్లు తగ్గించారని, దీనివల్ల ఎంతోమంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకొనే ఆలోచన చేయకపోగా వారిని ఇబ్బంది పెట్టే నల్ల చట్టలను రూపొందించిందని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతులంతా ఐక్యమై పోరాడడం వల్ల ఈ చట్టాలను రద్దు చేశారని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులంతా కట్టు బానిసలుగా పనిచేసేలా కార్మిక చట్టాలను రూపొందించారని, దీనివల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విషయాన్ని ఎప్పుడో పక్కన పెట్టేసిందని, రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా అధికారంలోని వైసిపి, ప్రతిపక్షంలోని టిడిపి నాయకులెవరూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడం లేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో సామాన్యులకు ఎటువంటి ప్రయోజనాలు లేకుండా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, బడుగు, బలహీన వర్గాలకు నష్టం కలిగించి కార్పొరేట్లకు లాభం చేకూర్చేలా రూపొందించారని విమర్శించారు. అనంతరం జెసి ఒ.ఆనంద్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.ఇందిర, సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ కేంద్ర బడ్జెట్‌పై కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

పాచిపెంట : కేంద్రబడ్జెట్‌కు నిరసనగా మండల కేంద్రమైన పాచిపెంటలో సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిని అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, మంచాల శ్రీనివాసరావు, సూకూరు అప్పలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు, సిఐటియు నాయకులు చింత పోలిరాజు మాట్లాడారు.

కొమరాడ : స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ధర్నా జరిగింది. సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన నిర్వహించిన నిరసనలో నాయకులు బలరాం, గంగరాజు, సన్యాసిరావు, రామకృష్ణ, వెంకట్రావు, బాల సుబ్రహ్మణ్యం, రాజేష్, సుబ్బారావు, నీలయ్య, ప్రసాద్.. పాల్గొన్నారు. అనంతరం డిటి సిహెచ్ రమేష్‌బాబుకు వినతిని అందజేశారు.

బలిజిపేట : స్థానిక బస్టాండ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యమ్మల మన్మధరావు, సీనియర్ నాయకులు వంజరాపు సత్యనారాయణ, రైతు సంఘం జి.సత్యనారాయణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వైనాయుడు ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.వెంకటరావు,టి.ఇందు,టి.రవి, శంకరరావు పాల్గొన్నారు.

సీతానగరం: కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి లక్ష్మునాయుడు, మండల కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఎంవి రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, ఆర్.రమణమూర్తి, బి.అప్పారావు, సిహెచ్ కృష్ణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు దేశ సంపద దోచి పెట్టేలా, సామాన్యులకు తీవ్ర నష్టం చేసేలా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మిక, సామాన్య, పేద ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బిజెపి తన విధానాలు మార్చుకొని ప్రజానుకూలమైన విధానాలవైపు పయనించాలని, లేనిచో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరణం రవీంద్ర, సూర్యనారాయణ, పారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జియమ్మవలస : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, మండల కార్యదర్శి కోరంగి సీతారాం మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ కన్వీనర్ దావాల రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో అర్ధముడి లక్ష్మణరావు, మల్లవరపు రమేష్, కాద రాము, బి.పట్టాభి, ఎస్.కామేష్, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు ; బలిజిపేటలో రాస్తారోకో చేస్తున్న నాయకులు; సాలూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్నఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్/రూరల్

ప్రజల ప్రాణ రక్షణ ముఖ్యమని, రహదారి భద్రతా నియమ, నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని ఎస్‌పి వి.విద్యా సాగర్‌నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రవాణా, పోలీస్ శాఖలు సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఆటో డ్రైవర్ల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లడం నేరమన్నారు. డ్రైవింగ్‌లో నిష్ణాతులైనప్పటికీ ఆటోలో ముందు, వెనుక అధిక లోడ్ వేసి ప్రమాదాలకు గురవుతున్నారు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రహదారి భద్రత నియమ, నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేని వారికి డ్రైవింగ్ మెగా మేళాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం అందించే బీమా పథకాలపై అవగాహన కల్పించి ఇన్సూరెన్స్ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆటోలు నిలిపే స్థలాలను కేటాయిస్తామన్నారు. అధిక లోడుతో ప్రయాణించే ఆటోల ఫోటోలు తీసి సామాన్యులు కూడా తమ దృష్టికి తీసుకొచ్చేం దుకు ప్రత్యేక మొబైల్ నెంబర్‌ను ప్రకటిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి ప్రమాదాల రహిత జిల్లాగా నిలిచేందుకు బాధ్యత వహించాలని కోరారు. డ్రైవర్లకు అకారణంగా ఇబ్బందులకు గురి చేస్తే తన దష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా ప్రత్యేక నిఘా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. డ్రైవర్లు యూనిఫాంను ధరించి బాధ్యతను ప్రతిక్షణం గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ డీఎస్పీలు ఎ.సుభాష్, జి.కృష్ణారావు, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఎం.శశికుమార్, ఎన్.రమేష్ కుమార్, వర ప్రసాద్, కాశీరాం నాయక్, పలువురు సిఐలు, ఎస్‌ఐలు, డ్రైవర్ల యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు, తదితరులు, పాల్గొన్నారు.

వేగవంతంగా ఆర్‌అండ్‌ఆర్ పనులు : జెసి

కలెక్టరేట్ : జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద పునరావాస పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. ఆర్ అండ్ ఆర్ పనులపై రెవెన్యూ, కార్యనిర్వహణ శాఖలతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీల్లో మంజూరైన పనులు, వాటి ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలుంటే తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్ అండ్ బి, ఆర్. డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారులు జె.శాంతీశ్వర రావు, ఎం.జేమ్స్, ఓ. ప్రభాకర రావు, తోటపల్లి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారి జి.రామచంద్ర రావు, తహశీల్దార్లు, గహ నిర్మాణ సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించే గొంతును గెలిపించండి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

పట్టభద్రుల, ప్రజా సమస్యలపై చట్టసభలో ప్రశ్నించి, పరిష్కారానికి కృషి చేసేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ఎంవిపి హెల్త్ ఎరీనాలో ఆమె ప్రచారం చేపట్టారు. పట్టభద్రులతో మాట్లాడారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను మాటలతో మోసం చేస్తున్నాయన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించటం లేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మూడున్నరేళ్లుగా ఒక్క నోటిఫికేషనూ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పిడిఎఫ్ బృందం ఆర్‌కెఎస్‌వి.కుమార్, రాజేశ్వరరావు, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, అష్రఫ్, చంటి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీలో ప్రచారం చేపడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

భీమునిపట్నం : పిడిఎఫ్ అంటేనే విద్యావంతుల అభిప్రాయాలను శక్తివంతంగా, స్వతంత్రంగా వినిపించే వేదిక అని, తాజా, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీల వారసత్వాన్ని కొనసాగిస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి, మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు.

ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార హంసను కలిశారు. కాగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా పిడిఎఫ్ వెంటే ఉన్నారని, గత ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లేశామని, ఈ సారికూడా పిడిఎఫ్‌కు సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రకటించారు.

దేశభక్తిని దిగంతాలకు చాటిన పాడుదమా స్వేచ్ఛా గీతం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అమరవీరుల త్యాగాలను చాటుతూ, దేశభక్తిని మేల్కొలిపే ఉత్తరాంధ్ర ప్రజాకవి గంటేడ గౌరునాయుడు రచించిన పాడుదమా స్వేచ్ఛాగీతం.. ఖ్యాతి దిగంతాలకు పాకి అజరామరగీతంగా మారిందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు, పంచాయితీరాజ్ ఇఇ జివిఆర్ కృష్ణాజి అన్నారు. జనవిజ్ఞాన వేదిక, స్నేహకళాసాహితీ ఆధ్వర్యంలో వేదిక జిల్లా అధ్యక్షులు, పిఆర్ డిఇ రత్నకుమార్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక గిరిజన భవనంలో జరిగిన పాడుదమా స్వేఛ్ఛా గీతం 30ఏళ్ల పండగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశనాయకుల పేర్లు ఎక్కడా పెట్టకుండా వారి ఔన్యత్యాన్ని చాటుతూ, స్వాంతంత్ర్య పోరాట ఘట్టాలను తలపింపచేసి రాసిన ఈ గీతం రాష్ట్ర గీతం స్థాయిలో రాశారని అన్నారు. సామాజిక పరిస్థితులు, అణగారిన వారి బాధలు, మహనీయుల త్యాగాలపై ఎంతో అవగాహన కలిగి, సాహితీ విలువలు పుణికిపుచ్చుకున్న గీతమని కొనియాడారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు మాట్లాడుతూ 3000 వేలమంది చిన్నారులు ఒకేసారి ఈ గీతాన్ని ఆలపించి తెలుగు బుక్‌రికార్డుల్లోకెక్కిందని, ఆ రికార్డును అధిగమించేలా జిల్లాలో ఉన్న పాఠశాలల్లో ఒకేసారి అంతకుమించి విద్యార్థులతో పాడించేలా జిల్లా అధికారులు కృషిచేయాలని అన్నారు. సమావేశంలో రేలారేలా కార్యక్రమం నిర్వాహకులు, గాయకులు జానకీరామ్, రచయిత మల్లిపురం జగదీష్ ఆలపించిన గౌరునాయుడు గజల్స్, గీతాలు సభికులను రంజింపచేశాయి. కార్యక్రమంలో ఐటిడిఎ డిఇఒ మోహనరాయుడు, జిల్లా పౌరసంబంధాల అధికారి లోచర్ల రమేష్, ప్రజాసంఘాల నాయకులు రంజిత్‌కుమార్, జనవిజ్ఞానవేదిక కార్యదర్శి, పిఆర్ జెఇ చంద్రమౌళి, రచయితలలు పక్కి రవీంధ్రనాద్, సిరికి స్వామినాయుడు, చుక్క పారినాయుడు, పెంట అప్పారావు, గడగమ్మరామకృష్ణతో పాటు సాహితీ అభిమానులు, ఔత్సాహిక కళాకారులు, కవులు హాజరయ్యారు.

నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఏజెంట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి..

40 మంది నామినేషన్లు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను విశాఖ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ సమక్షంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి చివరి రోజు గురువారం వరకూ 44 మంది 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలో నాలుగు నామినేషన్లను తిరస్కరించారు.

నలుగురివి తిరస్కరణ

విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ, విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించినట్టు ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. ఈ నెల 27 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. నామినేషన్ల పరిశీలనలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉన్నారు.

కుక్కలు బాబోయ్!

తెలుగు రాష్ట్రమైన హైదరాబాద్‌లో నడిచి వెళ్తున్న నాలుగేళ్ల బాలుడిని వీధి కుక్కలు పీక్కు తిని చంపేసిన ఘటన జిల్లా వాసులను గగుర్పాటుకు గురిచేసింది. పట్టణాల్లో విచ్చల విడిగా స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలను చూసి ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నగరంలోని పలు వార్డుల్లో ప్రతిరోజు వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గతంలో తోటపాలెం, దాసన్నపేట తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు మూకుమ్మడి దాడి చేసి పలువురిని తీవ్రంగా గాయపర్చిన సంఘటనలు ఉన్నాయి.

- వీధుల్లో స్వైర విహారం
- మేల్కొకుంటే ప్రమాదం
- నియంత్రణా చర్యలు శూన్యం

వైకెఎం నగర్‌లో సంచరిస్తున్న కుక్కల గుంపు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం పట్టణంలో 2015లో 2వేల కుక్కలు ఉంటే నియంత్రణ చర్యలు లేకపోవడం వల్ల వాటి సంఖ్య సుమారు 4వేలకు పెరిగిందని ఉందని ప్రజారోగ్య సిబ్బంది చెబుతున్నారు. 2015లో ఒక సారి, 2019 లో ఒకసారి కుక్కలకు ఆపరేషన్లు, కొన్ని కుక్కలను పట్టుకొని అడవుల్లో వదిలేసే విధంగా చర్యలు చేపట్టారు .ఆ తర్వాత నుంచి ఎటువంటి చర్యలు లేకపోవడం వలన వాటి సంఖ్య భారీగా పెరిగింది. దీంతో నగరంలో ఏ వీధికి వెళ్లినా, ఏ ప్రధాన రహదారిలోనైనా కుక్కలు కనిపిస్తూ భయపెడుతున్నాయి. అలాగే పాలకొండలో 3వేలు, సాలూరు పట్టణంలో 3,500కు పైగా కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి.

ప్రధాన రహదారుల సెంటర్లలో కుక్కలు పాదచారుల వెంట పడి మరీ కరుస్తున్నాయి. మొరిగే కుక్క కరవదు అంటారు. కానీ మొరగని కుక్కలే కాదు మొరిగేవి సైతం కూడా పిక్కల పట్టుకొని పీకుతున్నాయి శునకాల గుంపుతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల గుంపులను చూసి గడగడలాడి పోతున్నారు.. రాత్రి, పగలు అని తేడా లేకుండా వెంటపడి మరీ కరుస్తున్నాయి. పాదచారులనే కాదు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలటం లేదు. శునకాల దెబ్బకు ఇంటి నుండి బయటకు రావాలంటే రాత్రి పూట భయపడే పరిస్థితి అనేక వీధుల్లో నెలకొంది. ఉదయం ఇంటింటికీ పేపర్ వేసే వారు కూడా కుక్కలు కారణంగా 7 గంటలు సమయంలో పేపరు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. వీటి నియంత్రణకు స్పందనలో కమిషనర్‌కి వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోతోంది. జంతు పరిరక్షణ చట్టం వల్ల వీధి కుక్కల సంఖ్య పెరిగి వాటి వీర విహారం కూడా పెరిగిపోయింది. గతంలో కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం వీటి నియంత్రణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

ముగ్గురు చిన్నారులపై దాడి

పార్వతీపురంరూరల్: జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంతో పాటు మండలంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, వీటి బారిన పడుతున్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన గౌడువీధిలో ఒకేసారి ముగ్గురు చిన్నారులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచగా, వెంటనే జిల్లా అసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అటు పార్వతీపురం మండలంలోని నరిసిపురం, వెంకంపేట, తాళ్లబురిడి, పెదబొండపల్లి గ్రామాల్లోనూ వీటి బారిన పడి తీవ్రంగా గాయపడిన వారు ఎందరో ఉండగా, కొన్ని గ్రామాల్లో ఏకంగా మేకల మ ందలపై దాడి చేసిన సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ, పంచాయితీలపై ప్రభుత్వం మార్గదర్శకాలు కఠినంగా ఉండడంతో నిరోధించలేక చేతులెత్తేస్తున్నారు. ఊరవతలకు వెళ్తే ఏనుగులు, పులులు సమస్యలతో పాటుగా ఊరిలోపల ఈఊరకుక్కల విజృంభణ ప్రజల పాలిట కంటకంగా మారాయి. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి వీటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని, అలాగే జిల్లా ఆసుపత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ నిరోధ ఇంజెక్షనులు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి



కాలువల పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఇ సుగుణాకర్

ఖరీఫ్ నాటికి లైనింగ్ పనులు పూర్తి

ప్రజాశక్తి -వీరఘట్టం

రాబోయే ఖరీఫ్ సీజన్లో తోటపల్లి ప్రధాన ఎడమ, కుడి, ఎడమ కాలువల లైనింగ్ పనులను పూర్తి చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నట్లు ఉత్తరాంధ్ర చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని హుస్సేన్‌పురం వద్ద చేపడుతున్న పనులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. కుడి, ఎడమ కాలువల హెడ్ దగ్గర రక్షణగోడల పనులు తక్షణమే నిర్మించాలని సిబ్బందిని ఆదేశించారు. బుడ్డిడి దగ్గర సైఫన్ డ్రాయింగ్, డిజైన్ తక్షణమే పంపించాలని ఆదేశించారు. బ్రిడ్జిలు సూపర్ పాసేజ్‌లను త్వరగా నిర్మించాలని, కుడి, ఎడమ ప్రధాన కాలువల షట్టర్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు తోటపల్లి, బుడ్డిడి, కత్తులకవిటి, రాజపురం గ్రామాల వద్ద జరుగుతున్న కాలువ లైనింగ్ పనులు పరిశీలించారు. ఆయన వెంట పర్యవేక్ష ఇంజనీర్ పి.సుధాకర్, ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ డి.రవికుమార్, సహాయ కార్య నిర్వాహక ఇంజనీర్లు బి.శంకర్రావు, డివి రమణ, కాంట్రాక్టర్ మోహన్‌బాబు శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గౌరీనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రచారంలో భాగంగా కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

సీతంపేట : ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం 250 ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి కోసం కృషి చేసే పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.సురేష్, కార్యదర్శి ఎం.కాంతారావు అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పార్వతీపురంరూరల్: మండలంలోని సంగంవలసలో శుక్రవారం వెలుగు అద్వర్యంలో మహిళా సంఘాలకు అర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న లీడ్ బ్యాంకు మేనేజర్ జెఎల్ఎన్మూర్తి మాట్లాడుతూ అన్ని రకాల ఋణసదుపాయాలు, కేంద్రం అందిస్తున్న భీమా,పింఛన్, పొదుపుసంఘాలకు చెందిన వడ్డీరేట్లు, గురించి వారికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు వెలుగు ఎపిఎం పువ్వల సురేష్, సిసిలు,వివోఎలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతాంజలి

భూ అభివృద్ధి పనుల పరిశీలన

సీతంపేట : మండలంలోని పాలమనుగూడలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించనున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కె.గీతాంజలి పరిశీలించారు. వేతనదారులకు వంద రోజులు పని కల్పిస్తూ సరాసరి రూ.257 రోజువారి కూలి వచ్చేలా కొలతలు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం మల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు.

ఎం.రాజపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని ఎం.రాజపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎ.మానస గర్భిణులకు, వృద్ధులకు, చిన్న పిల్లలకు, మధుమేహం, రక్త పోటు తదితరమైన వారికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథాశ్రమ నిర్వాహకునికి చెక్కును అందజేస్తున్న బాలాజీ

అనాథాశ్రమానికి ఆర్థిక సాయం

సీతంపేట : మండలంలో పులిపుట్టిలో గల యువ మిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అమ్మ బాలల అనాథ శరణాలయం, అమ్మ వృద్ధాశ్రమాలకు కొత్తూరు మండలం కలిగాం గ్రామానికి చెందిన బేవర బాలాజీ రూ.10 వేలు ఆర్థిక సహాయం శుక్రవారం యువ మిత్ర సర్వీస్ సొసైటీ డైరెక్టర్ గొర్లె గెడ్డయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో అనాథ శరణాలయం నడపడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గొర్లె సుజాత, కో-ఆర్డినేటర్ గంధవరపు అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

పాచిపెంట : మండల కేంద్రమైన పాచిపెంటలోని త్రినాథ స్వామి ఆలయ ప్రాంగణంలో పిన్నింటి ఈశ్వరరావు, ప్రసాదబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండలం నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. ఈ మహోత్సవ కార్యక్రమం బుధవారం నుంచి శుక్రవారం వరకు అత్యంత వైభవంగా వేద పండితుల మంగళ వాయిద్యాల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సీతంపేట: మండలంలో ఐటిడిఎ జంక్షన్ వద్ద విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఎస్సై ఎ.నీలకంఠరావు శుక్రవారం అవగాహన కల్పించారు. మైనర్ బాలురులు వాహనాలు నడపరాదన్నారు. మితిమీరి వేగం వెళ్లరాదని ఓవర్ లోడ్ వేయరాదని అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదని వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠం

లక్ష్య సాధనకు కృషి చేయాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి విద్యార్థి శక్తివంచన లేకుండా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఉన్న శ్రీ వాసవి జూనియర్ కళాశాల రెండో ఏడాది విద్యార్థులు వీడ్కోల సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దశలోనే విద్యార్థులు ఒక గొప్ప జీవిత ఆశయం ఏర్పర్చుకొని దాన్ని సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగు తారన్నారు. అనుకున్న లక్ష్యం సాధించే వరకూ విశ్రమించకుండా శ్రమిస్తే తప్పక జీవితంలో ఉన్నతంగా నిలిచి ఎంతో మందికి ఆదర్శంగా నిలవడమే కాకుండా మీ తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చి వారికి సమాజంలో గౌరవ ప్రతిష్ఠలను కలుగ చేసిన వారీగా మిగులుతారని అన్నారు. మరో ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించేందుకు కషి చేయాలని సూచించారు. కార్యక్రమంలోకళాశాల అధినేత మణికుమర్, వైసిపి సీనియర్ నాయకులు బాచీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

ఎఫ్ఆర్ఎస్ హాజరు పరిశీలించిన పిఒ

రికార్డులను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

పాచిపెంట : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు వేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు ˆరణ్ అన్నారు. మండలంలోని పనుకువలస, సాలూరు మండలం అన్నంరాజు వలసలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను తనిఖీ చేసిన ప్రాజెక్టు అధికారి, పి. కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఇంకా మెరుగుపర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల భవితకు ప్రాథమిక విద్య అత్యావశ్యకం అన్నారు. సిసి రహదారులు, కాలువలు, కరకట్టలను తనిఖీ చేసిన పిఒ నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడరాదని స్పష్టం చేశారు.

మండలంలో 590మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం 590 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తహశీల్దార్ డివి సీతారామయ్య తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ పట్టభద్రులు ఎన్నికల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

నేడు మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 10గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని కమిషనర్ జె.రామ అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సాధారణ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా హాజరు అవుతారని, ఈ సమావేశానికి పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

టిడిపితోనే అభివృద్ధి : ద్వారపురెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిందని, కావున టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అధ్యక్షతన పార్వతీపురం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చడమే తప్ప ఈ ప్రభుత్వం తమకు చేసింది ఏమీలేదని ప్రజలు భావిస్తున్నారని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని 20ఏళ్ల వెనుక్కు తీసుకువెళ్లి దేశంలోనే అట్టడుగు స్థాయికి దిగజార్చారని విమర్శించారు. ఆఖరుకు తమ నాయకులు వెళ్తే ఓట్లు పడవని గ్రహించిన సిఎం జగన్ గృహసారథులు, వాలంటీర్లు, కన్వీనర్లు అంటూ కొత్త నాటకం మొదలెట్టారని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని మార్చాలని జనం ఎప్పుడో నిర్ణయించేశారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపిదే విజయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ పార్టీపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని వినియోగించుకుని చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్న సంకల్పంతో ప్రతి కార్యకర్త తమ పరిధిలో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డి.శ్రీదేవి, కౌన్సిలర్లు కోల మధు, కె.నారాయణరావు, బడే గౌరినాయుడు, తాతపూడి వెంకటరావు, నాయకులు జి.వెంకట నాయుడు, ఉదయభాను, దొగ్గమోహనరావు, కొల్లి తిరుపతిరావు, జి.రవికుమార్తో పాటు సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలం, పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతిరావుకు పసుపు కండువా వేస్తున్న చంద్రబాబు

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన 'పెంట'

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎ.వెంకంపేట మాజీ సర్పంచ్, సీనియర్ ఆడిటర్ పెంట తిరుపతిరావు గురువారం టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల అనంతరం తిరుపతిరావు టిడిపిని వేడి బిజెపిలోకి వెళ్లారు. ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. మండలంలోని తిరుపతిరావు మళ్లీ టిడిపిలోకి రావడంతో పార్టీకి పూర్తిస్థాయిలో జవాసత్వాలు వచ్చినట్లేనని శంబరం ఎంపిటిసి సభ్యులు టి.పోలినాయుడు, వెంకటబైరిపురం మాజీ సర్పంచ్ దాకేటి దేవకీ పరమహంస, మార్కొండపుట్టి టిడిపి నాయకులు బుచ్చినాయుడు, బంగారువలస మాజీ సర్పంచ్ భాస్కరరావు తదితరులు తమ హర్షం వ్యక్తం చేస్తూ తిరుపతిరావుకు అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తిరుపతిరావు నాయకత్వంలో పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. అలాగే పార్టీలోకి తిరుపతిరావు రావడంతో మండలంలోనీ టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఆదర్శంగా ఆర్డబ్ల్యుఎస్ డిఇ కార్యాలయం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలోని ఆర్డబ్ల్యుఎస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని డిఇ కె.నాగేశ్వరరావు ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు ఆ కార్యాలయం పాడుబడిన బంగ్లాలా ఉండేది. కానీ ఈయన ఇక్కడ విధుల్లో చేరిన తర్వాత ఆ కార్యాలయం రూపు రేఖలు మార్చి నూతన భవనాలు తయారు చేసి కార్యాలయం చుట్టూ పూలు, పండ్ల మొక్కలు వేసి ఆయనే స్వయంగా ఆ మొక్కలకు అన్ని సదుపాయాలు చేస్తున్నారు. సిబ్బంది సహకారంతో కార్యాలయాన్ని పచ్చదనంగా తయారు చేస్తూ మండల కేంద్రంలో ఉన్న అన్ని కార్యాలయాలు కన్నా ఆదర్శంగా తీర్చిదిద్దారు. తన సొంత ఇల్లును ఏ విధంగా అయితే ఉంచుతారో ఆ విధంగా కార్యాలయం ఉంచడం పట్ల ఆయన్ను పలువురు అభినందిస్తున్నారు.

కార్యాలయ ఆవరణలో మొక్కలు నీళ్లు పోస్తున్న డిఇ నాగేశ్వరరావు

కుటుంబాలకు టిడిపి భరోసా

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని అంటివలసలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు నియోజకవర్గ టిడిపి నాయకులు భరోసా కల్పించారు. నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి తోయక జగదీశ్వరి ఒక్కొక్క కుటుంబానికి రూ.3 వేలు నగదు, 25 కేజీల బియ్యం బస్తాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శానాపతి ఉదయ్ శేఖర్ పాత్రుడు, జెడ్పీ మాజీ చైర్మన్ గులిపల్లి సుదర్శన్రావు, అరకు పార్లమెంట్ అధ్యక్షులు నంగిరెడ్డి మధుసూదన్ రావు, నందివాడ కృష్ణబాబు మాస్టారు, పొట్నూరు వెంకటనాయుడు, అధికారి వేణు, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, మరిసర్ల సింహాచలం, సత్యనారాయణ, పడాల హరి, బొంగు భాను, పాలక నూకరాజు, బత్తిలి శ్రీను, ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు, డొంకాడ హరి, గుల్ల వెంకటి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అరుకు పార్లమెంట్ ఎస్సిసెల్ ప్రధాన కార్యదర్శి బిడ్డిక తమ్మయ్య ఆధ్వర్యాన బాధితుల కుటుంబాలకు రూ.3వేలుచొప్పున ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఆశావాహులు బిడ్డక పద్మావతి, పువ్వల లావణ్య నాయకులు మరడాన వెంకటనాయుడు, మీసాలశశిభూషణ్ రావు, మాజీ ఎంపిపి రమణ మూర్తి, నాగేశ్వరరావు, మూజువాణి, ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

బ్యాంకు లింకేజీతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్కుమార్ అన్నారు. మండలంలోని రస్తాకుటుంబాయిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి సంఘాలు తీసుకున్న అప్పులు, సంఘం ఏర్పాటు చేసినప్పుడు వారి పొదుపు, అప్పటి ఆర్థిక స్థితి, ఇప్పుడు వారి ఆర్థిక పరిస్థితి, సభ్యులను అడగి తెలుసుకొని వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం వారి జీవనోపాధికి సంబంధించిన యూనిట్లను సందర్శించి చింతపండు నిల్వపై అడిగి తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఇవి కిషోర్, సిసిలు, సచివాలయ సిబ్బంది, విఒఎలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కిరణ్కుమార్

బైక్ బోల్తా ; ఇద్దరు దుర్మరణం

ప్రమాదంలో బోల్తాపడిన బైకు (ఇన్సెట్లో మృతి చెందిన రాకేష్)

ప్రజాశక్తి - భామిని

మండలంలోని ఘనసర సమీపం లో తలడా మలుపు వద్ద బైకు అదుపు తప్పి బోల్తా పడిన సంఘనలో ఆరిక రాకేష్ (13) అక్కడికక్కడే మృతి చెందగా, జీవన్ (20) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం జరిగిన ఈ నంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఘనసరా పంచాయతీ తాటిమానుగూడకు చెందిన ఆరిక రాకేష్, బిడ్డిక జీవన్, ఆరిక రోహిత్ తాటిమానుగూడ నుంచి ఘనసర మీదుగా బాలేరు వెళ్తున్నారు. మార్గమధ్యలో గల తలాడ కూడలి మలుపు వద్ద వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ క్రమంలో రాకేష్ తల నేలను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బిడ్డిక జీవన్ను రాగోలు జెమ్స్కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఆరిక రోహిత్ తీవ్రగాయాల పాలయ్యాడు. రాకేష్ శ్రీకాకుళంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రాకేష్కు తండ్రి ధర్మారావు, తల్లి సుజాత, అన్నయ్య ఎనియస్, చెల్లి రాజేశ్వరి ఉన్నారు. రాకేష్ మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగాగా విలపిస్తున్నారు. బత్తిలి ఎస్ఐ వై.అమ్మన్నారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

బొబ్బిలి: భోజరాజపురం ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రం నుంచి మున్సిపాలిటీకి సరఫరా అయ్యే పైపులైన్ లీకులను నివారించేందుకు మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. దీంతో శని, ఆదివారాల్లో పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల పాత పైపులైన్ తీసివేసి నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పనులు పూర్తి అయిన వెంటనే తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని, తాగునీటి సరఫరా అంతరాయనికి ప్రజలు సహకరించాలని కోరారు

గుంప శివాలయ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- కొమరాడ

జంఝావతి నాగావళి నదుల సంగమంలో వెలిసిన గుంపు సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన్న ప్రసన్నకుమార్, కాపారపు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాపారపు శివున్ననాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక సర్పంచులు ఆలయ ధర్మకర్తలతో కలిసి గుంపు శివాలయాన్ని పరిశీలించారు. ఇప్పటికే కాపారపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.8 లక్షలతో గతంలో షెడ్ నిర్మాణం చేపట్టారు. అభివృద్ధిలో భాగంగా వంతెనతో పాటు ఆలయం చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నట్లు తెలిపారు. శివరాత్రి సందర్భంగా కాపారపు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇప్పటికే వంతెన నిర్మాణానికి అవసరమైన రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. ప్రభుత్వం తరపునుంచి కూడా ఆలయ అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దీంతో పాటు వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన్, కోటిపాం సర్పంచ్ భర్త సుంకరి వెంకటరమణ, కల్లికోట సర్పంచ్ దత్తి మురళి ఆర్య అర్చకులు చిట్టిబాబు దేవు బాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అధికారులు విఫలం

వంగర : రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ చర్చలో వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పలు గ్రామాల్లో ఇప్పటికీ రైతుల దగ్గర ధాన్యం ఉండిపోయాయని చెప్పారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేక ఆవేదన వ్యక్తంచేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిపి సురేష్ స్పందిస్తూ ఈ విషయంపై ఇప్పటికే జిల్లా అధికారులతో మాట్లాడామని, మండలంలో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరామని తెలిపారు. మండలానికి ప్రస్తుతం ఉన్న లక్ష్యంలో శివ్వాం, తలగాం, వివిఆర్ పేట, మడ్డువలస జగన్నాథవలస గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శ్రీకాకుళం డిసిసిబి జనరల్ మేనేజర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ శివ్వాం పిఎసిఎస్ ద్వారా రుణాలు మంజూరు చేసినప్పటికీ రికవరీలో వెనుకంజలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ డి.ఐజాక్, ఎంపిడిఒ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో గ్రూపుల పోరు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలో అధికార పార్టీలో రోజురోజుకూ గ్రూపు రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నాయకుల మధ్య ఐక్యత లోపించడం, తమ మాటే నెగ్గాలనే పంతానికి పోవడంతో గ్రూపులుగా వీడి పెత్తనం కొనసాగిస్తున్నారు. వీరిని సమన్వయ పరచడంలో జిల్లా నాయకత్వం విఫలమైందని చెప్పక తప్పదు. ప్రజాప్రతినిధులుగా అధికారం చేపట్టిన వారిని పక్కన పెట్టి, వైసిపి నాయకులు కూరాకుల సూర్యారావు కనుసన్నల్లోనే మండల పాలన సాగుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు సైతం ఆయననే అనుసరిస్తున్నారనే చర్చ సాగుతోంది.

గతేడాది నవంబర్ 29న ఎంపిపి గేదెల శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో వైసిపి నాయకులు కూరాకుల సూర్యారావు ఫొటో లేదు. వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఏ ఫ్లెక్సీలోనూ ఆయన ఫొటో కనిపించలేదు. అయినప్పటికీ జిల్లా పెద్దలు సూర్యారావు మాటే వింటున్నారని పలువురి భావన. ఇటీవల జరిగిన జెసిఎస్ కన్వీనర్ల నియామకంలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల మాటలు బేఖాతరు చేస్తూ ఎవరి ఇష్టానుసారంగా వారు నియామకాలు చేపట్టారు. ఈ విషయంలో అసహనానికి గురైన ప్రజాప్రతినిధులు పార్టీని వీడతారనే భయంతో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు వారిని పిలిపించి చర్చించినట్లు తెలిసింది. అయినప్పటికీ ఐక్యత లేకుండా ఎవరి దారి వారిదే అన్న చందాన వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎంపిడిఒ కార్యాలయంలో జెడ్పిటిసి సభ్యులు తూర్పాటి వరలక్ష్మికి కార్యాలయం కోసం ఒక గది కేటాయించాలని సూర్యారావు గ్రూపు అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ పంచాయితీ జిల్లా నాయకత్వం వరకు చేరింది. ఒక గ్రూపునకు చెందిన పార్టీ ఫ్లెక్సీలు భద్రంగా ఉండి ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్)కు చెందిన ఫ్లెక్సీలను ఇటీవల చించివేయడం, గత నెల 24న రంగరాయపురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంతపేట ఎంపిటిసి సత్యవతి, ఆమె భర్త జగ్గన్నదొరపై దౌర్జన్యంగా మరో గ్రూపు వారు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో చేయి చేసుకొని, తోసివేయడం... కొన్ని కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం వంటి సంఘటనలు వీరి ఐక్యత పట్ల ఉదాహరణగా చెప్పుకోవచ్చు. జిల్లా నాయకత్వం గ్రూపుల పోరును చల్లారుస్తుందా? దగ్గరుండి మంట కాగుతుందా? వేచి చూడాలి.